# ధేనుక

పి.ఎస్.నారాయణ



# ధేనుక

పి. ఎస్. నారాయణ

---

## నవల

# ధేనుక

## (నవల)

**యువ**

మాసపత్రిక మార్చి, 1976 సంచిక లో
అనుబంధ నవలగా ప్రచురింపబడింది.
తరువాత
ఆనందమిత్ర పబ్లికేషన్స్, మచిలీపట్నం వారు
1979 లో పుస్తకరూపంలో తీసుకువచ్చారు.

**వెల:రు. 60**

గమనిక

ఈ నవలలోని పాత్రలు, సంఘటనలు–
అన్నీ కల్పితాలు, ఎవర్నీ ఉద్దేశించినవి కావు.
ఎక్కడయినా పోలికలు, సామ్యాలూ
కనిపించినా అవి యాదృచ్ఛికమే.

–రచయిత

# ధేనుక

కాత్యాయిని ఖాళీ అయిన రైల్లోనుంచి నీరసంగా చేతిలో సూట్కేసుతో ప్లాట్‌ఫాం మీదకు దిగింది. ఆ ప్లాట్‌ఫాం తన మనస్సంత గజిబిజిగానూ వున్నది. ఒకళ్ళ మీదగా ఒకళ్ళు దాటుకుంటూ మనుష్యులు నడుస్తున్నారు. వాళ్ళ మీదనే పడుతున్నట్లుగా పుస్తకాలబండీ, బిస్కెట్లబండీ మీదమీదకి వస్తున్నాయి.

కాత్యాయిని చేత్తో సూట్కేసు పట్టుకొని, మనుష్యులను తప్పించుకుంటూ గుంటూరు స్టేషన్ బయటకు వచ్చింది.

అక్కడంతా చీకటిగా– జానకి బ్రతుకంత భయంగా వున్నది. ముందుగా ఖాళీస్థలం జానకి ముందు బ్రతుకులా వెలితిగా కనిపిస్తోంది. ఎత్తయిన స్థంభాలకు మిణుకు మిణుకుమంటూ వెలుగుతున్న విద్యుత్ దీపాలు ఆమె జీవితం లాగానే కళాహీనంగా కనబడుతున్నాయి.

దూరంగా వెలుగుతున్న ఓవర్ బ్రిడ్జిమీద తెల్లబలుబులు ఆమె గడిచిపోయిన జీవితంలా వెలిగిపోతున్నయి. ఆ బ్రిడ్జి మీదగా రిక్షాలో పోవాలంటే తనకు గుండెల్లో భయం భయంగా వుంది. అందుకే కాస్త దూరమయినా దాని క్రిందగా చీకట్లోనుంచి వెళ్ళి, మెడికల్ కాలేజీ మీదగా, కలెక్టరాఫీస్ ముందుగా, పధ్నాలుగో అడ్డరోడ్డు గేటులోనుంచి బ్రాడీపేటకు వెళ్ళాలనుకున్నది.

"రిక్షాకావాలా అమ్మా?"

మెదలకుండా సూట్కేసును రిక్షాలో పెట్టేసి ఎక్కి కూర్చున్నది. చల్లటిమంచు– జానకి కన్నీళ్ళలా మీద కురుస్తుంటే టాపు వేయమందామని అనుకొని కూడా–

కన్నీళ్ళలో తడిసిపోయి నోరు పెగలక అలాగే కూర్చున్నది.

జనరల్ హాస్పిటల్ వైపుకు రిక్షా తిప్పబోతుంటే, “ఉఁహూఁ... కలెక్టరాఫీసు వైపుకు పోనీయ్!” అన్నది.

వెలుగంటే తనకు భయమేస్తున్నది.

సాయంత్రం ఆయన ఆఫీసునుంచి వస్తూ పిడుగులాంటి వార్త మోసుకొచ్చాడు– జానకిభర్త రామ్మూర్తి పోయాడట!

ఇదెక్కడి ఘోరం?

తన స్నేహితురాలు, ఆత్మీయురాలు– ఎందుకు– తన మరో ఆత్మ జానకి– దాని భర్త పోవడమా?

“నిజమా?... నిజం చెప్పండి!... నిజం చెబుతున్నారా మీరు?” భర్తను కుదిపేస్తూ అడిగింది. “మీకెలా తెలుసు?”

“గుంటూరునుంచి ఉదయమే శివం వచ్చాడు... వాడి పెళ్ళాం పురిటికి వెళ్ళి అక్కడే వున్నది... వాడి అత్తగారిల్లు జానకి వాళ్ళింటి దగ్గరే... ఏదో మాటమీదొచ్చి– వాళ్ళు మనకు తెలుసని గుర్తుకు రావడంతో చెప్పాడు– హార్ట్ ఎటాక్ అట!”

పక్కగా పట్టాలమీదగా పోతున్న రైలు కూసిన కూత రాబందు కేకలా వున్నది.

జానకిని ఎలా చూడాలి?... ఎలా పలకరించాలి??

జానీ... జానీ... జానీ... నీకెంత కష్టమొచ్చిందే!

కళ్ళల్లో నీళ్ళు ఉబుకుతున్నయి. గుండె పట్టు తప్పుతున్నట్లుగా అదిరదిరిపడుతున్నది

ఊగుతున్న రిక్షాలో– అసహనంగా అటూ యిటూ కదులుతూ కూర్చున్నది కాత్యాయిని.

జానకిని వెంటనే చూడాలి.

పట్టాలమీదగా దిగి రిక్షా లోయలోకి జారిపోతున్నట్లుగా చీకట్లోకి జారిపోయింది.

"ఇంకాస్త ముందుకు పోనీయ్... రెండో లైనుకు తిప్పు!"

అవును– అదే జానకి వాళ్ళ యిల్లు!

ఎప్పుడూ కళకళలాడుతూ తళతళా మెరుస్తుండే ఆ యిల్లు అంత నిర్జీవంగా వున్నదేం?

– ఇంటి యజమాని లేకపోతే ఆ యింటికి వెలుగెక్కడిది?

రిక్షా దిగుతుంటే గుండె పట్టుకున్నట్లుగా కలవరపడింది. చేతిలోకి తీసుకున్న సూట్కేసు మోయలేని బరువు అవుతోంది. వేస్తున్న ప్రతి అడుగూ గతపు వెలుగు మీద పడుతున్న చీకటి నీడే అవుతున్నది.

దగ్గరకు వేసివున్న గేటును, శవంలా పడివున్న జానకిని తట్టి లేపుతున్నట్లుగా నెట్టి లోపలకు అడుగు వేసింది.

తొమ్మిది గంటలకే ఎక్కడి జనం అక్కడ– స్మశానంలో వున్న బూడిద కుప్పల్లా పడివున్నారు. పైనుంచి వెలుగు శవాన్ని కాల్చేటందుకు ముట్టించిన కట్టెల వెలుగులా వున్నది. వంటయింట్లో తిరుగుతున్న మనుష్యులు రాబందుల కోసం పిండాలు తయారుచేసే మనుష్యుల్లా కనబడ్డారు.

ముందు హాల్లో మూలగా– గద్దల గుంపులా కూర్చున్నారు నలుగురయిదుగురు మనుష్యులు– మాటలాపి చప్పుడయిన గేటువంక కొత్తగా స్మశానంలోకి వస్తున్న శవాన్ని చూస్తున్నంత ఆసక్తిగా కాత్యాయినిని చూడసాగారు.

వాళ్ళ కళ్ళు– కళ్ళల్లోనుండి ప్రాణం పోయిన శవం కళ్ళలా వున్నాయి.

కాత్యాయిని కంఠంలో ఏడుపు– ఆస్తమా రోగి కఫంలా వుండచుట్టుకు పోతోంది.

"జానకి ఏది?"

అందరూ విచిత్రంగా కాత్యాయినిని చూశారు.

అందులో ఒకామె లేచి 'రండి' అన్నట్లుగా ముందుకు నడిచింది.

ఓ దీపంలేని గదివంక చూపుతూ, "లోపల వున్నది... వెళ్ళండి!" అన్నది ఆమె. కాత్యాయినిని చీకటి గదిలోకి తోస్తున్నట్లుగా చేయి ఊపింది.

కాత్యాయిని కొద్దిగా వంగి సూట్కేసును నేలమీద పెట్టి, రెండడుగులు ముందుకు వేసి, తలుపు మండిగం మీద రెండు చేతులూ వేసి, ముందుకు వంగి, చీకట్లోకి కళ్ళు చించుకు చూస్తూ, "జానీ!" అన్నది.

భోరుమన్నది.

ఆ క్షణంలోనే ఆ గృహంలో మరో శవం లేచిందేమో నన్నంతగా జానకి కంఠం ఘొల్లుమన్నది.

* * *

"జానీ!"

శవాన్ని స్నానంచేయిస్తున్నట్లుగా మీదపడి ఏడుస్తున్నది జానకి. కాత్యాయినిని కౌగిలించుకున్నది. స్నేహితురాలిని ఉండచుట్టుకునిపోయి, తన సర్వస్వం ఆమేనన్నట్లుగా గుండెలకు అదుముకోసాగింది. "కాత్యాయినీ!"

అరగంట తరువాత ఆ ప్రదేశం శవం కాలి బూడిదయింతరువాత ఆవరించిన నిశ్శబ్దంలా వున్నది. ఉండి ఉండి జానకి గుండెల్లోనుండి ఎగతన్నుకొస్తున్న వెక్కిళ్ళు సాయిబుల గోరీలమీదగా గుబురుగా వున్న చెట్లలోనుంచి వస్తున్న పేరు తెలియని పిట్టల కూతల్లా వున్నాయి. ఆ గదినంతా ఆవరించిన చీకటి అమావాస్యనాడు ఒక్క శవాన్నీ చూడని స్మశానంలా వున్నది– అంత పెద్ద గదిలో మూలగా పడివున్న జానకి విడిచిన గుడ్డల కుప్పలా వున్నది.

"ఎందుకయింది ఇలా?"

"నా ఖర్మకొద్దీ!"

"త్రాగుతుండేవారా?"

"త్రాగిన వాళ్ళంతా చస్తున్నారా ఏమిటి?"

"డాక్టరు ఏమన్నారు?'

"అంత టైం ఎక్కడున్నది?" ఏడుపు ఘొల్లుమన్నది.

"యిరవై నాలుగు గంటలు గడిచిపోయింది... నువ్వు మనిషివి కాలేవా?"

"మనిషిని కాబట్టే బ్రతకి వున్నాను!"

"ఇప్పుడు బాబుకి నువ్వే తల్లీ తండ్రివి అని గూడా తెలుసా?"

జానకి కళ్ళముందు ఒక పెద్ద లోయ గజిబిజిగా కనబడుతోంది.

"అవును కదూ... అసలు నా బాబు ఏడి?" పిచ్చిపిచ్చిగా చూస్తూ ఏడ్వసాగింది.

కాత్యాయినికీ ఆ చూపులకు దుఃఖం ఆగలేదు.

"నీకు బాబే గుర్తులేడా?"

"నేను జీవించి వున్నాననే గుర్తులేనప్పుడు– బాబు ఎక్కడ?"

"బాబును నువ్వు నిన్నటినుంచి చూడనేలేదా?" కళ్ళు చించుకు చూస్తూ అడిగింది దిగులుగా కాత్యాయిని.

"లేదు!" అన్నది బెక్కుతూ జానకి.

"జానీ! ఎంత దగాపడిపోయావే నువ్వు జీవితంలో..." కాత్యాయిని చీరచెంగుతో జానకి కళ్ళుతుడుస్తూ అన్నది.

కాత్యాయిని లేచి నిలబడింది, ఆ చీకట్లోనుంచి వెలుగులోకి రావాలన్నట్లుగా. అంతేగాదు తన మిత్రురాలు, ఆత్మీయురాలు జానకిని కూడా తీసుకురావాలన్నట్లుగా బాబుకోసం బయటకు బయల్దేరింది.

రెండడుగులు వేసి, "కొరివి ఎవరు పెట్టారు?" అడిగింది ఒక్కక్షణమాగి.

“బ్రతికున్న ఎవరో!”

ఇక ఆ స్మశానంలో బ్రతికి వున్నవాళ్ళు బ్రతకటం కష్టం అన్నట్లుగా గడపవతల కాలుపెట్టేసింది.

ఎక్కడా మనుష్యుల అలికిడిలేదు. నిర్జీవప్రాంతంలా నిశ్శబ్దంగా వున్నది.

ముందు హాల్లోకి వచ్చింది. వంటయింట్లో లైటు వెలుగుతోంది. రెండడుగులు అటుగావేసింది.

మాటలు వినబడుతున్నాయి.

మరో అడుగు ముందుకు వేసి, తలుపివతలే నిలబడి లోపలికి తొంగి చూసింది.

అందరూ ఒక బంతిగా కూర్చొని భోజనాలు చేస్తున్నారు.

ఎవ్వరూ కాత్యాయినిని చూడనే లేదు.

“ఏంవే! అరటికాయ కూరలో ఉల్లిపాయలు వేయలేదేమే?” అంటున్నాడు ఒకాయన.

“కొంపలో ఉండిఏడవద్దు!” మరొకరి జవాబు.

“తెప్పించగూడదూ!”

“గోపిగాడిని వెళ్ళమంటే వెళ్తేనా?” విసుగ్గా ముసలమ్మ సమాధానం.

ముందుకు వంగి అసహ్యంగా చూస్తూ, “బాబు ఎక్కడ?” అన్నది కాత్యాయని పెద్దగా.

అందరూ ఉలిక్కిపడి వాకిలివైపుకు చూశారు.

ఒక్కక్షణం తరువాత ముందుగా ముసలమ్మే కోలుకొని, “స్నానంచేసిరా అమ్మా! ఎప్పుడనగా బయలుదేరావో... భోజనం చేద్దువుగాని!” అన్నది.

“బాబు ఎక్కడున్నాడో ముందు చూడనీయండి!” అన్నది అసహనంగా.

“ఏ బాబు?” ముసలాయన పుల్లవిరుస్తున్నట్లుగా అన్నాడు.

“జానకి కొడుకు!”

“వాకిట్లో మంచం మీద పడుకొని నిద్రపోతున్నాడు!” అన్నది పదేళ్ళ పిల్ల.

జానకి విసురుగా బయటకు వచ్చింది.

పాడుబెట్టిన ప్రదేశంలా వున్న ఆ ముందు భాగంలో వంటరిగా వట్టిమంచంమీద పడుకొని వున్నాడు పసిపిల్లవాడు– జానకి మూడేళ్ళ కొడుకు!

వంటిన వున్న చొక్కాకు గుండీలు ఊడిపోయివున్నాయి. పెరిగి జులపాల జుట్టు చెదిరి ముఖాన్నంతా ఆవరించి వున్నది. జుట్టును పక్కకు తొలిగిస్తే కళ్ళవెంట కారిన నీరు, ముక్కులమ్మట కారిన చీమిడి అట్టలు కట్టి అసహ్యంగా వున్నది. అతడు అంత నిద్రలోనూ ఉండి ఉండి బెక్కుతూనే వున్నాడు.

“అరె బాబూ!” అంటూ ఎత్తుకోపోయినదల్లా షాక్ కొట్టినట్లుగా వదిలేసింది.

వాడి వళ్ళు సలసలా కాగిపోతోంది. కాత్యాయిని కదిలించడంతో ఉలిక్కిపడి వణికిపోతూ ఏడుస్తున్నాడు.

“నాయినా! బాబూ!” అంటూ భుజాన వేసుకున్నది వాడిని కాత్యాయిని.

కాత్యాయినికి ముందు జానకిమీద కోపమొచ్చింది. ఆపైన లోపల మరీ బంతులుతీరి కూర్చొని తిండి తింటున్న మనుష్యులలాంటి మృగాలమీద కోపమొచ్చింది. ఆతరువాత మనుష్యులను ఏడిపించేటందుకే పుట్టిస్తున్నట్లున్న దేంవుడి మీద కోపమొచ్చింది.

భోజనాలు చేస్తున్న వాళ్ళ దగ్గరకు బాబును భుజంమీద వేసుకు వచ్చి, “బాబు వళ్ళు జ్వరంతో సలసలా కాగి పోతున్నదని ఎవ్వరికీ తెలియదా?” అన్నది.

నిర్మల ఒక్క ఉదుటున లేచి అక్కడకు వచ్చింది. ఆమె జానకి ఆడబిడ్డ. భోజనం చేయకుండా అందరి ఎదుటా కూర్చొని సవాళ్ళు తీస్తోంది.

"అవునూ... ఆమాటే మర్చిపోయాను ఈ వంట హడావుడిలో... అరేయ్ గోపీ! భోంచేయగానే వెళ్ళి ఏవైనా రెండు మాత్రలు పట్టుకురారా... వేద్దాం!" అంటూనే రెండు చేతులూ జాచి, "ఇటివ్వండి... భయపడినట్టున్నాడు!" అన్నది.

– ఆ మాట జానకిలాంటి కొత్త మనిషి ఎత్తుకోవటంతో వాడు భయపడ్డాడు అనే అర్థమొచ్చేలా వున్నది.

కాత్యాయిని ఆమె మాట తీరుకు కాస్త కలవరపడింది. కాని, క్షణంలోనే కోలుకొని, "మీకెందుకులేండి శ్రమ... భోజనాలు కానివ్వండి ముందు... నేనే తీసుకు వెళ్ళి ఎవరైనా డాక్టర్‌కి చూపించి వస్తాను!" అంటూనే గిరుక్కున వెనక్కు తిరిగింది.

వెనగ్గా నిర్మల ఏదో అంటున్నా కాత్యాయిని వినిపించుకోలేదు.

దబదబా ముందుకు వెళ్ళి, నిలబెట్టివున్న తన సూట్‌కేసును మామూలుగా పెట్టి, మంగళసూత్రాలకు కట్టుకున్న తాళంచెవితో, వంగి తాళంతీసి, చిన్న పర్సు తీసుకొని, తిరిగి సూట్‌కేసుకు తాళంవేసి, జానకి గదిలోకి తొంగిచూస్తూ, "జానకీ! ఒక్క పదినిముషాల్లో వస్తానే!" అంటూ బయటకు విసురుగా వచ్చింది.

* * *

రాత్రి ఆ చీకటిగదిలో జానకి పక్కగా దుప్పటి పరుచుకొని, బాబుని పక్కలో పెట్టుకొని కాత్యాయిని పడుకున్నది.

చీకటి నల్లగా భయంకరంగా ఆ ప్రదేశాన్నంతా ఆవరించివున్నది. బాబు వంటిమీద వున్న ఆమె చేయి ఇంకా కాలుతూనే వున్నది. పక్కగా జానకి తను ముఖాన్ని ఈ ప్రపంచంలో ఇంకెవ్వరికీ చూపించలేనట్లుగా మాసి మరకలు పడ్డ చీర చెంగుతో కప్పుకున్నది.

ఒక్క సంఘటన జానకి జీవితాన్ని ఎంతగా మార్చివేసింది?

స్మశానభూమిలో సమాధుల్లా అందరూ పడుకొని నిద్రలోకి ఒరిగిపోయారు ఆ యింట్లో.

# 2

తెల్లవారుతుండగానే లేచింది కాత్యాయిని.

బాబు వళ్ళు చల్లగా వున్నది. 'హమ్మయ్యా' అన్నట్లుగా ఓ తేలిక నిశ్వాసం విడిచింది. పక్కన జానకి ఇంకా ముఖంమీద కప్పుకున్న చీర చెంగును తన ముఖాన్ని ఎవ్వరూ చూడగూడదన్నట్లుగా తీయనే లేదు.

"జానీ! లేచి మొహం కడుక్కో!"

జానకి మాట్లాడలేదుగాని, మెళుకువతోనే వున్నట్లుగా కదిలింది.

"ఇప్పుడేం తొందర?"

"తొందరలేదు కాబట్టి కడుక్కోనంటావా?"

"లేచి ఏం చేయమంటావు నన్ను?"

"ముందు లేచి మొహం కడుక్కో- అంతే!" అన్నది కరుకుగా.

– రాత్రి బాబు అలా జ్వరంతో వాకిట్లో అనాధుడిలా పడివుంటే ఎవ్వరూ పట్టించుకోకుండా వంటయింట్లో పడి మేస్తుండటం కాత్యాయిని గుండెల్లో కరుకు తనాన్నే పేర్చింది.

దీనికంతటికీ కారణం ఎవరు?

చచ్చిన ఆ మగమనిషా?

బ్రతికున్న ఈ ఆడమనిషా?

– చచ్చిపోయాడు ఆయనకేం మహారాజు!

బ్రతికుండి చచ్చినట్లు పడివుండటానికి దీనికేమొచ్చింది రోగం?

– ఆ క్షణాన జానకి ఎలాంటి పరిస్థితులలో వున్నదీ, ఆమె మనస్సంతా ఎంత

అస్తవ్యస్తంగా వున్నదీ కూడా ఆలోచించనీయలేదు కాత్యాయినిని ఆమె మనస్సు... సలసలా వళ్ళు కాగిపోతుండగా వంటిన సరైన చొక్కాకూడా లేకుండా వంటరిగా ఆరుబయట వాకిట్లో పడివున్న బాబు రూపమే కళ్ళముందు కదులుతోంది.

"బీరువా తాళం చెవులు ఇటు ఇవ్వు!" అన్నది చేయి జాపుతూ.

"ఎక్కడున్నయ్యో!"

"బీరువా తాళంచెవులు ఎక్కడున్నయ్యోకూడా నీకు తెలియదా?" అన్నది అసహనంగా చూస్తూ కాత్యాయిని.

"అన్నిటికీ మించిన ఆయనే నాకు కాకుండా పోయినప్పుడు– ఆ వెధవ బీరువా తాళంచెవులు ఎక్కడున్నయ్యో ఎవరిక్కావాలే!" అన్నది జానకి విసుగ్గా.

"పోయిన ఆయన ఎలాగూ తిరిగి రాలేదు... ఆయనతోటే ఆ తాళంచెవులూ పోవాలా?"

"కాత్యాయినీ! నన్ను విసిగించబోకు... నీ సవాళ్ళకు సమాధానం చెప్పేటంత ఓపిక నాకు లేదు... ఎవరి దగ్గరున్నయ్యో అడిగి తీసుకో!" అంటూనే ముఖం మీద చీర చెంగును మరింత బిగించుకున్నది.

కాత్యాయని బయటకు వచ్చేసింది, ఇక అక్కడ నిలబడటం అనవసరం అన్నట్లుగా.

మళ్ళీ బాబును డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాలి. ముందు గదిలోకి వచ్చి, జానకి ఆడబిడ్డ నిర్మల, అక్కడ కుర్చీలో కూర్చొని కాఫీ త్రాగుతుంటే అడిగింది, "బీరువా తాళంచెవులు ఎవరి దగ్గరున్నయి?" అని.

"తెలియదు!" అన్నది ముఖం పక్కకు తిప్పుకుంటూ నిర్మల.

"కనుక్కోండి... నాకు కావాలి అవి!" అని అంటూనే మరోమాటకు అవకాశమివ్వకుండా బాత్‌రూంలోకి వెళ్ళి ముఖం కడుక్కోసాగింది.

తనకు తెలుసు– ఆయన పోయిన ఇరవైనాలుగు గంటలలోనే అక్కడ జేరిన

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Thenuka**

* * *